# ఖైదీ




ఆంధ్రభూమి, 15 నవంబరు 97

నా కూతురు అక్బర్ని ప్రేమిస్తోందన్న విషయం ఈవేళ్టిదాకా నాకు తెలీదు. ప్రేమంటే వాళ్ళిద్దరూ చెట్టాపట్టాలేసుకుని పార్కులకీ, సినిమాహాళ్ళకీ తిరగలేదు. కనీసం ఎవరూలేని ఏకాంతంలో ప్రేమబాసలు మాట్లాడుకున్నారో లేదో తెలీదు. అసలు వాళ్ళిద్దరూ కలుసుకునే పదేళ్ళైంది.

పదేళ్ళ క్రితం రాగిణి పదిహేనేళ్ళ పిల్ల. అక్బర్‌కి యిరవై. అప్పటి జ్ఞాపకాలు ఈ రోజు ఉదయం పేపర్లో వచ్చిన ఓ చిన్న వార్తతో ఎగదన్నుకొచ్చాయి.

మతకల్లోలాలలోను, అల్లర్లలోను పాల్గొని లెక్కలేనన్ని హత్యలు చేశాడని అక్బర్‌కి ఉరిశిక్ష విధించారు. ఆ వార్తతోపాటు అతని ఫోటో కూడా పేపర్లో వేశారు. అది చూసి రాగిణి స్పృహతప్పి పడిపోయింది.

తెలివొచ్చాక తనన్న మొదటిమాట, "డాడీ! నేను అక్బర్ని చూడాలి." అని.

"వీల్లేదు. సమాధి కట్టేసిన ఆ జ్ఞాపకాలని తిరగదోడడానికి నేనొప్పుకోను. వాణ్ణి చూడాల్సిన అవసరం నీకు లేదు" నా భార్య శాంతి ఆవేశ పడిపోయింది.

మరేమీ అనకుండా ఏడుస్తూ కూర్చుంది రాగిణి. పచ్చి మంచినీళ్ళు కూడా గొంతులో పోసుకోలేదు. రెండు రోజులు అలాగే గడిపింది. తన అంతర్యమేమిటో నాకు తెలీలేదు. స్త్రీ హృదయం మరో స్త్రీకి తెలుస్తుందంటారు. తనకేం అర్థమైందోగాని శాంతి చాలా నిగూఢంగా వుంచింది.

బుధవారమే అక్బర్ని వురితీసేది. ఆ రోజు తెల్లారిందంటే రాగిణి యింకెప్పటికీ అతన్ని చూడలేదు. అది పడ్తున్న క్షోభ చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. శాంతి కూడా చాటుగా కళ్ళొత్తుకోవడం చూసాక నేనిక ఆలస్యం చెయ్యలేదు. రాజమండ్రీకి రెండు టిక్కెట్లు కొనుక్కొచ్చాను.

"మళ్ళీ దాన్నా రొంపిలోకి దింపుతారా?" భయంతో వణికిపోతూ అడిగింది శాంతి.

"వాడికి వురికాకుండా మరేశిక్ష వేసినా నేనూ నీలాగే ఆలోచించేవాడిని" అన్నాను.

"వాడితో మనకి అనుబంధం వుందని మీరు భావిస్తున్నారా? వాడు మనకేమీ కాడు. విశ్వాసఘాతకుడు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టిన నీచుడు. ఆ జ్ఞాపకాలలోంచి బైటపడి రాగిణీ యిప్పటికి మనిషైంది. మళ్ళీ మొదటికొస్తాం" అని ఏడ్చేసింది.

"కొంతమంది శాపగ్రస్తులుంటారు. మనంకూడా అంతే. రాగిణి పసిపిల్లేం కాదు. మంచీ చెడూ మనం దగ్గిరుండి చెప్పాల్సిన అవసరం లేదు. దాని మనసులో ఏ బాధ రగుల్తోందో, ఏ

జ్ఞాపకం ఆ బాధని రగులుస్తోందో గానీ అక్బర్ని చూడాలని అదనుకుంటోంది. వద్దనే హక్కు మనకి లేదు. ఒక్కసారి వాణ్ణి చూసొచ్చినంత మాత్రాన వచ్చే కీడు యిప్పటిదాకా జరిగిన దానికన్నా ఎక్కువేం వుండదు" వోదారుస్తూ నచ్చజెప్పాను.

రాగిణిని తీసుకుని బయల్దేరాను. రైల్లో ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. ఎర్రటి చీర కట్టుకుని షాల్ కప్పుకుంది రాగిణి. నుదుట ఎర్రటి బొట్టు మెరుస్తోంది. కళ్ళల్లో మాత్రం కళా, కాంతీలేవు. చూపులెక్కడో సుదూరంగా చిక్కుబడి వున్నాయి. నాకు తన మౌనం చూస్తుంటే బాధ కలుగుతోంది.

ఈ పదేళ్ళ కాలంలో రాగిణి చాలా అరుదుగా నవ్వింది. ఇప్పుడు తన బిగుసుకున్న పెదాలు చూస్తుంటే అన్పిస్తోంది, అవికమీదట నవ్వడాన్ని పూర్తిగా మర్చిపోతాయని ఆ వూహే భరించలేకపోయాను.

"రాగిణీ! కాఫీ తాగుతావా?" మౌనాన్ని ఛేదిస్తూ అడిగాను. తాగుతానన్నట్టు తలూపింది. వెంటనే రైలుదిగి రెండు కప్పుల్తో కాఫీ తీసుకొచ్చి ఒకటి తనకిచ్చి మరొకటి నేను తీసుకుని విండో దగ్గర నిలబడి తాగసాగాను.

ఇంతలో రైలు కూతేసింది. కప్పు పారేసి రైలెక్కాను. రైలు కదిలింది. నా సీట్లో కెళ్ళి కూర్చున్నాను. కాసేపటికి రాగిణి కూర్చునే నిద్రలోకి జారిపోయింది. నా ఆలోచనలు గతంలోకి పరుగు తీసాయి.

★★★

ఉద్యోగరీత్యా దేశం నలుమూలలా తిరిగి వచ్చి హైదరాబాద్ చేరుకున్నాను. ఛార్జి యిస్తూ "మీ కభ్యంతరం లేకపోతే మా యిల్లు లెటౌట్ చేస్తాను. అందులో వుండండి" అన్నాడు రహమాన్.

పాతబస్తీలో వున్న పురాతనమైన యిల్లది. నాలుగ్గదులు, వరండా, విశాలమైన ఆవరణ. నీటి వసతి బాగానే వుంది. ఇంటి ముందు చిన్న తోట కూడా వుంది. నాకు యిల్లు బాగా నచ్చింది. వెంటనే రహమాన్ ప్రపోజల్‌కి వప్పేసుకున్నాను.

నేను పుట్టింది మద్రాస్‌లో. మా నాన్న ఆలిండియా సర్వీసెస్‌లో చేసేవారు. నాలుగేళ్ళకొకసారి ట్రాన్స్ఫరౌతూ వుండేది. చదువు పాడౌతుందని నన్ను చిన్నప్పుడే హాస్టల్లో వేసారు. చదువంతా మద్రాసులోనే గడిచింది. తర్వాత నేను కూడా ఆయన వారసత్వమే తీసుకుని ఢిల్లీ, బెంగుళూరు, జయపూర్‌లలో ఒక్కొక టెన్యూర్ చేసి చివరకి ఈ వూరు చేరాను.

హైద్రాబాద్ గురించి ముఖ్యంగా పాతబస్తీలో జరిగే గొడవల గురించి నాకు పరిచయం లేదు. ఆంధ్ర రాష్ట్రీయుణ్ణన్న భావన నా నరనరాన్నా జీర్ణించుకుపోయి వుందేమో స్వరాష్ట్రానికి వచ్చి చేరుకున్నందుకు చాలా సంతోషించాను. తర్వాత శాంతినీ, పిల్లల్నీ తీసుకొచ్చాను. ప్రభు యింటరు, రాగిణి నైన్త్ చదువుతున్నారు. వాళ్ళని హాస్టల్స్‌లో వెయ్యడం నాకిష్టంలేదు. చిన్నప్పట్నుంచీ ఆదరాభిమానాల కోసం మొహం వాచిన వాణ్ణి. వాళ్ళని వదిలిపెట్టి వుండలేను.

ఇక్కడకొచ్చిన ఆరు నెలలకనుకుంటాను, ప్రభు అక్బర్ని వెంటపెట్టుకుని వచ్చాడు. ఇద్దరిదీ ఒకటే క్లాసు. ఒకటే గ్రూపు. అక్బర్ ప్రభుకన్నా పొట్టిగా వున్నాడు. దైన్యంతో నిండి మొహం దిగులు గూడుకట్టుకున్న కళ్ళు... నన్ను చూడగానే వంగి నమస్కరించాడు. అప్పటికే ప్రభు అతడి గురించి అన్నీ చెప్పాడు. అతడి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. ఉన్నదొక్క అన్న. అతను కూడా వారం రోజుల క్రితం ఏక్సిడెంట్‌లో పోయాడు. దాంతో అక్బర్ బజార్న పడ్డాడు. ఆశ్రయం యివ్వడానికెవరూ ముందుకి రాలేదు. "డాడీ! ఈ ఒక్కడూ మనింట్లో

వుండనిస్తే యింటరైపోతుంది. ఏదో ఒక ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోతాడు. చాలా బ్రైట్ స్టూడెంట్. మనం కాదంటే యింటరు కంప్లీట్ చెయ్యలేడు" ఆశగా నా మొహంలోకి చూస్తూ అడిగాడు ప్రభు.

"బాబూగారూ! నాకు ఆశ్రయం యిచ్చేవాళ్ళంటూ ఎవరూ లేరు, మా అన్న తన కడుపు మాడ్చుకుని ఫీజులు కట్టి యింతదాకా చదివించాడు. మీరు యీ వొక్క సంవత్సరం సాయంచేస్తే యింటరు పాసౌతాను. నా అన్న కోరిక తీరుతుంది. మీరుణం నేనుంచుకోను. మీ నౌకరన్ని మానిపించండి. ఆ పనులన్నీ నేను చేసిపెడ్తాను" అక్బర్ దీనంగా అన్నాడు.

బీదరికం మనిషికి పెద్ద శాపం. దాన్ని వంటరిగా అనుభవించాల్సి రావడం యింకా పెద్దశాపం. ఈ అక్బర్ నాకేమీ కాకపోవచ్చు. అతన్తో ఎలాంటి ఆత్మీయతా లేకపోవచ్చు. కానీ సాటిమనిషిగా అతనికంటే పరిపక్వమైన వ్యక్తిగా అతని ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసాను. అతనికిప్పుడు కావల్సినవి ఆశ్రయమూ, ఆదరణ. అవి రెండూ లేకపోతే దాదాగానో, రౌడీగానో మారిపోతాడు. ఓ భావిభారత పౌరుడి జీవితగమ్యం నా చేతిలో వుంది.

నా చిన్నప్పుడు మా యింట్లో వారాల పిల్లలుండేవారు. నేను పెరిగిన వాతావరణం నాలో కుల, మత బేధాల యిరుకుగోడల్ని నిర్మించలేదు. నా మీద ఎంతో నమ్మకం వుంచి ప్రభు తన మిత్రుణ్ణి యింటికి తీసుకొచ్చాడు. వాణ్ణి సంతోషపెట్టడం అన్నిటికన్నా నాకు ముఖ్యం. అలాంటి సంతోషంలోనే వాడు పరిపూర్ణంగా పెరగగలుగుతాడు.

అక్బర్‌కి యీ యేడాదీ ఆశ్రయమిచ్చి చదువవ్వగానే నా పలుకుబడిని వుపయోగించి ఏదో ఒక ఉద్యోగం యిప్పించాలని నిశ్చయించుకున్నాను. శాంతి కూడా తన అనుమతిని తెలిసింది.

ఆ విధంగా అక్బర్ ప్రవేశం మా ఇంట్లోకి జరిగింది. ఇది సమస్యలకి దారి తీస్తుందని నేననుకోలేదు.

అక్బర్ అన్నాడు కదా! నేను నౌకర్ని మానిపించలేదు. కానీ ఒకరోజు సుస్తీచేసిందని వాడే రాలేదు. మున్సిపాల్టీవాళ్ళ స్ట్రైయిక్ కారణంగా అంతకు ముందురోజు పంపుల్లో నీళ్ళు రాలేదు. కానీ మేం లేచేసరికి అన్నింటిలో నీళ్ళున్నాయి. వీధి పంపు నుంచి తెచ్చినవి అవి. అది అక్బర్ పనేనని గ్రహించి నాలుగు కేకలేసాను. తర్వాత నాకే అనిపించింది అతన్లో దారుణమైె ఆత్మన్యూనత చోటు చేసుకుంటోంది. అది పోవాలంటే యిలాంటి చిన్నా చితక పనుల్ని మీద వదిలెయ్యాలి. తద్వారా అతను తన కృతజ్ఞతని చూపించుకుని భారాన్ని తగ్గించుకుంటాడు. అప్పట్నుంచీ చూసీ చూడక కొన్ని పనుల్ని అక్బర్ చేస్తుంటే పట్టించుకోవడం మానేసాను. ఇదతని వ్యక్తిత్వాన్ని వంకర పోకుండా సాపు చేసింది.

రోజులిలాగే సాగిపోతే అక్బర్ చదువైపోయేది. ఎక్కడో ఓ ఉద్యోగమూ దొరికేది. కానీ చాలా బలమైన మలుపు మా ముందుంది. కాలనౌకలో అమిత వేగంతో ప్రయాణిస్తున్న మా బ్రతుకులు ఆ మలుపు దగ్గిర చిన్నాభిన్నమై పోయాయి. ఇందుకు అక్బర్ ఎంతవరకూ బాధ్యడనేది ప్రశ్న.

★★★

బ్రతుకు దేవుడిచ్చినవరం. కొందరికి ఆ వరాన్ని ఉపయోగించుకోవడం చేతకాక శాపంగా మలుచుకుంటారు. ఖాదరు ఈ కోవకి చెందిన వాడే.

మొదట పెళ్ళైంది. నలుగురు పిల్లలు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆవిడద్వారా మరో ఐదుగురు. ఈ యిద్దరు భార్యల్నీ, తొమ్మండుగురు పిల్లల్నీ పోషించలేక చాలా అవస్థపడేవాడు.

అతనిది మా పక్కిల్లు. మా యింటికి ఆనుకునే వుంటుంది. మానవ సహజమైన కుతూహలంచేత నేను ఖాదర్ జీవన సరళిని క్షుణ్ణంగా పరిశీలించాను. తెల్లటి పైజామా, కుర్తా ధరించి పవిత్రంగా కనిపించే అతన్లో ఒక మిస్టర్ హైడ్ దాగున్నాడేమోననిపించేది.

ముస్లిమ్ లొకాలిటీలో హిందూ ఫేమిలీ వుండటం మా ఏరియాలో చాలా మందికి నచ్చలేదు. అందునా ఒక ముస్లిమ్‌కి మేము ఆశ్రయం యివ్వటం కంటగింపుగా వుండేది. అతన్ని మేం హిందువుగా మారుస్తామేమోనని వాళ్ళ భయం. అతన్ని బయటకి పంపెయ్యమని అన్యాపదేశమైన హెచ్చరికలు తరుచుగా వచ్చేవి.

"ఆ ఏరియాలో వుంటూ వాళ్ళ కుర్రాణ్ణి మీ యింట్లో వుంచుకుంటూ లేనిపోని కాంప్లికేషన్సెందుకు తెచ్చుకుంటావు? వాణ్ణేనా బైటికి పంపించేయ్ లేకపోతే మీరేనా యిల్లు మారండి" అని నా ఫ్రెండ్స్ హెచ్చరించారు.

ఇల్లు మార్చడం మంచిదనిపించింది. నలుగురైదుగురికి చెప్పి యింటికొచ్చాను.

"ఎందుకొచ్చిన గొడవిది? నెమ్మదిగా నచ్చజెప్పి అక్బర్ని ఖాదర్ దగ్గరికి పంపించెయ్యండి. కావాలంటే వాడి చదువుకయ్యే ఖర్చు మనమే పెట్టుకుందాం' అంది శాంతి.

సరే లెమ్మన్నాను. ఇల్లు మార్చబోతున్న సంగతి తనకింకా చెప్పలేదు.

"ఈ మధ్యనే అక్బర్ ప్రవర్తన కూడా మారింది. సాయంత్రాలు లేటుగా వస్తున్నాడు. రాత్రి మళ్ళీ బైటికెళ్తున్నాడు. ఖాదర్‌తో ఒకటే మంతనాలు" కాస్తంత ఆగి మళ్ళీ చెప్పింది శాంతి.

నేను ఆలోచనలో పడ్డాను. అక్బర్ ఖాదర్‌వైపు మొగ్గుచూపిస్తున్నాడా? ఎందుకు? సాటి మతస్తుడవటం చేతనా? దీని పర్యవసానం ఏమౌతుంది? సమస్య ఆలోచించిన కొద్దీ జటిలంగా కనిపిస్తోంది. ఎందుకింత ఆలోచన? నాలుగునెలల్లో యింటరు పరీక్షలున్నాయి. వాడు పాసైపోతే ఒక జీవనోపాధి దొరుకుతుంది. వాళ్ళవాళ్ళే ఎవరో ఒకరు పిల్లనిచ్చి వాణ్ణి తమలో కలుపుకుంటారు. నేను దీని గురించి ఎందుకింత వర్రీ అవడం?

★★★

ఆదివారం బద్ధకంగా తెల్లారి చురుగ్గా సాయంత్రమైంది. ఎక్కడికీ వెళ్ళలేదు. అందరం యింట్లోనే వున్నాం. రాత్రి భోజనానికి అక్బర్ బగారా చేస్తున్నాడు. అతడు యింట్లో బాగా కలిసిపోయాడు. శాంతి అతడికి కావల్సినవి అందిస్తూ అటూ యిటూ తిరుగుతోంది.

అక్బర్ బగారా చాలా అద్భుతంగా చేస్తాడు. అతన్ని పొగుడ్తూ తినేసాం. భోజనాలయ్యేసరికి బాగా లేటైంది. నాకు నిద్ర రాలేదు. టీవీ చూసి కాసేపయ్యాక జిడ్డు కృష్ణమూర్తి పుస్తకం తీస్తుంటే వీధి తలుపు చప్పుడైంది.

ఇంత రాత్రి ఎవరయ్యింటారా అని కిటికీలోంచి చూసేసరికి ఖాదర్ కనిపించాడు.

"ఇంతరాత్రి వచ్చారేంటి?" అని ప్రశ్నిస్తూ తలుపు తీసాను. ఆ రావటంలో కొంత జబర్దస్తీ కనిపించింది. వెంట ఒకరొకరుగా ఖాదర్ మిత్రులు వచ్చి చేరారు. వాళ్ళదగ్గిర్నుంచీ చౌకబారు సెంటు, పాన్. లిక్కర్లు కలగలిసిన వాసన వస్తోంది. వాళ్ళందర్తోటీ నాకు ముఖపరిచయం మాత్రం వుంది. ఇంతరాత్రయ్యాక అంతా కట్టుకట్టుకుని వచ్చారంటే నాకు ఏదో అనుమానంగా వుంది. అక్బర్ విషయంలో గొడవ పడటానికి వచ్చారా?!

నేను చాలా కరెక్టుగా గెస్ చేసాను.

"అక్బర్ మీ యింట్లో ఎందుకుంటున్నాడు?"సూటిగా అడిగాడు. తన ఫ్రెండ్సంతా వచ్చేసాక అతనీ ప్రశ్న అడగడానికి ఎంతో టైమ్ తీసుకోలేదు.

"అనాథ కదా, వుండి చదువుకుంటున్నాడు" క్లుప్తంగా అన్నాను.

"వంటవాడిగానా? నౌకరుగానా?" ఖాదర్ మాటల్లో వెటకారం.

"అవసరమైతే నా కొడుకు నా బూట్లు తుడుస్తాడు. నా కూతురు నేన తిన్న కంచం ఎత్తుతుంది" జవాబిచ్చాను.

నా జవాబునించీ తేరుకోవడానికి ఖాదర్‌కి కొంత వ్యవధి పట్టింది.

"వాణ్ణి హిందువుని చేద్దామనుకుంటున్నారా?"

నేను నవ్వాను. "మతమనేది ఒక నమ్మకం. దాన్ని వుగ్గుపాలతోటే పిల్లలకి రంగరించి పోస్తాం. దాన్ని మార్చడం సాధ్యపడుతుందని నేను నమ్మను. జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్న వ్యక్తి కూడా అసలుకే దేవుణ్ణి నమ్మడం మానేస్తాడేమోగానీ మతాన్ని మాత్రం మార్చుకోడు. అలా మార్చుకున్నట్టు ఎక్కడా చూడలేదు" అన్నాను.

"సాబ్! ఈ పెద్దపెద్ద మాటలు మాకు తెలీవు. మావాడొకడు హిందువుల యింట్లో వుండటానికి మేం వొప్పుకోం. వాణ్ణి బైటికి పంపెయ్యండి". అన్నాడు ఖాదర్.

"అతడు నా కొడుకు స్నేహితుడు. వాడికోరిక మీద అతనికి ఆశ్రయం యిచ్చాను. ఇంటరు సెకండియర్ చదువుతున్నాడు. అదవ్వగానే ఎక్కడో ఒకచోట జాబిప్పిస్తాను. తన బతుకు తను బతుకుతాడు" చెప్పాను.

వాళ్ళు వప్పుకోలేదు. అక్బర్ని తక్షణం యింట్లోంచి పంపించమని పట్టుపట్టారు. "నౌకరీ చూపిస్తానని వాణ్ణి వాడుకుంటున్నారు. అరటిపళ్ళ బండి పెట్టుకుంటే వాడు మీరు చూపించే నౌకరీ కన్నా స్వతంత్రంగా బతుకుతాడు" అన్నారు.

మాటామాటా పెరిగింది. ఆవేశాలు పెరిగాయి. గొంతులూ పెరిగాయి. పట్టుదలలూ పెరిగాయి. ఈ గలాభాకి లోపలి గదుల్లో పడుకున్నవాళ్ళంతా వచ్చేసి నిశ్చేష్టులై చూడసాగారు.

మతం అనేది ఆచరించే మనిషిని బట్టి, విలువని సంతరించుకుంటుంది. హిందూ మతం పామరుల చేతబడి మూఢనమ్మకాలకీ జంతు బలులుకీ నిదర్శనంగా నిలబడింది. అదే సమయంలో వేదపండితుల చేతుల్లో విరాజమానంగా వెలిగింది. ఇంకే మతమైనా కూడా అంతే ననిపించేలా వుంది ఖాదర్ వాళ్ళ ప్రవర్తన. ఏ దర్మమైనా, ఏ మతమైనా ఒక మనిషిని నిరాశ్రయుణ్ణి చెయ్యమనవు. అతడి నోటిదగ్గరున్న అన్నాన్ని లాక్కోమనవు.

నేనిప్పుడేం చెయ్యాలి? ఈ గొడవ ఎంతదాకా వెళ్తుంది? అసలీరాత్రి తెల్లవారుతుందా? లేకా రేపటి న్యూస్‌పేపర్లలో వార్తగా వస్తుందా? ఎలా పరిష్కరించాలి?

ఉన్నట్టుండి ఖాదర్ లేచి వెళ్ళు రాగిణి చెయ్యి పట్టుకున్నాడు. ఈ హఠాత్పరిణమానికి నేను తెల్లబోయాను.

"అక్బర్ని మీరే వుంచుకోండి. ఈ పిల్లని నేనుంచుకుంటాను" అన్నాడు వక్రంగా చూస్తూ.

ఈ పరిణామానికి నేను స్థాణువయ్యాను. వెంటనే ఖాదర్ రెండో భార్య నాకు గుర్తొచ్చింది. ఆమెకి పాతికేళ్ళకి మించి వుండవు. పదేళ్ళ పిల్లకి తల్లి! నా రక్తం ఉడికిపోయింది.

రాగిణి బిత్తరపోయి చూస్తోంది.

"ఖాదర్, పాప చెయ్యి వదులు" కటువుగా అన్నాను. "చాచా! ఆమెను వదులు" గట్టిగా అన్నాడు అక్బర్. యథాలాపంగా అతడికేసి చూసిన నేను వులిక్కిపడ్డాను. కళ్ళల్లో ఎర్రటి జీరలు! ముఖం కఠినంగా వుంది.

ఖాదర్ రాగిణిని వదిలిపెట్టేసాడు. అది అక్బర్ పక్కకి వెళ్ళి నిలబడింది. నా బుర్రలో ఏదో సందేహం పురుగులా దొలచడం మొదలైంది. అది వీళ్ళిద్దరి మధ్యా అవాంఛనీయమైన చనువు చోటు చేసుకుంటోందా? అని ఆ క్షణాన్నే నాకు అతడిపట్ల వ్యతిరేక భావం మొదలైంది.

"రావూ సాబ్! మీ మతం మీకెంత గొప్పదో మా మతం మాకూ అంతే! మీ పాపని నేను ముట్టుకుంటేనే మీకంత కోపం వచ్చింది. మా మతస్తుడు మీ యింట్లో వుంటే మాకు రాదా?" అనడిగాడు.

"అదీ యిదీ ఒకటేనా?" ఆ వ్యక్తిని చూస్తుంటే నాకసహ్యం వేసింది. ఇలాంటి మూర్ఖుల చేతిలో అర్థాలు మారిపోయిన మతం కోసం... నా కూతుర్ని బలి చెయ్యనా? ఖాదర్‌కి గానీ.... అక్బర్‌కిగానీ?

తల బలంగా విదిల్చాను.

ఖాదర్ ఈ రోజుని రాగిణి చెయ్యి పట్టుకున్నాడు. రేపు యింకో అడుగు ముందు కేస్తాడు. ఈ కుంపటి నిత్యం రగుల్తూనే వుంటుంది. ఈ నాటకంలో అక్బర్ పాత్ర వుందేమో! ఖాదర్ వాళ్ళకి వ్యతిరేకంగా వాడిని వుంచుకుంటే ఆ తర్వాత నెమ్మదిగా రాగిణితో ప్రేమ కలాపాలు మొదలుపెడ్తాడేమో! .

నా సంయమనం విచ్చుకుపోయింది. అక్బర్‌కేసి తిరిగి అన్నాను. "నీకేదో చెయ్యాలనుకున్నాను. వీళ్ళు పడనివ్వటం లేదు. నీ కోసం గొడవలుపడి నా యింటి పరువు బజారు కీడ్చుకునేంత ఔదార్యం నాకులేదు. ఈ ఖాదర్‌తో వెళ్ళిపో చదువు పూర్తయ్యాక వచ్చి కలువు. నాకు చేతనైన సాయం చేస్తాను" అన్నాను.

ఒక్క క్షణం. ఇల్లంతా పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో నిండిపోయింది.

"బాబుగారూ!" అక్బర్ దిగ్భ్రాంతిగా అన్నాడు.

"గెట్‌లాస్ట్ ఐసే" కఠినంగా అన్నాను. అక్బర్ మారుమాట్లాడకుండా తన వస్తువులు తీసుకుని ఖాదర్ వాళ్ళవెంట వెళ్ళిపోయాడు. మర్నాడే నేను శాంతీ వాళ్ళని మా వూరు పంపించి యిల్లు మార్చేసాను.

★★★

"మీ యింట్లో వుండేవాడే, మీ ప్రభు ఫ్రెండు చెడుసావాసాలు పడ్తున్నాడు" అని ఒక మిత్రుడునాతో అంటే

"అందుకే యింట్లోంచి పంపిచేసాను" అని జవాబిచ్చాను.

ఎంత వద్దనుకున్నా అక్బర్ గురించి ఏదో ఒక వార్త నా చెవిని పడ్తూనే వుండేది. ఖాదర్ చిన్న ఎత్తున దొంగ వ్యాపారాలు చేసేవాడు. అక్బర్ని అందులోకి యిరికించాడు. వాడిపేరు పోలీస్ రికార్డ్స్‌లోకి ఎక్కగానే వాడితో సంబంధాలు తెంపుకున్నాడట. అక్బర్‌కి యిప్పుడు తనదైన దారి వెతుక్కోవలసిన సమయం వచ్చింది. ఏదైతే కాకూడదని అతనికి ఆశ్రయం ఇచ్చానో అదే అయ్యాడతను.

అప్పుడు మాత్రం నాకు కొంచెం బాధ కలిగింది.

కానీ నేను తీసుకున్న నిర్ణయాన్ని గురించి అంతకు మించి ఎప్పుడూ బాధపడలేదు. అలా కాకుండా యింకోలా చేసి ఉండాల్సిందని ఎప్పుడూ అనుకోలేదు.

రాగిణి మాత్రం అక్బర్ని చాలా కాలం మర్చిపోలేదు. అతను వెళ్ళిపోయిన కొత్తలో నన్ను రెండు, మూడు సార్లడిగింది. "నాన్నా అక్బర్నెందుకు పంపించేసారు?"అని.

"పెద్దైతే నీకే అర్థమవుతుంది" అని నేనూ, శాంతీ మాట దాటేసేవాళ్ళం.

పెరుగుతున్న కొద్దీ రాగిణిలో ఒక విధమైన ఉదాసీనత, నిర్లిప్తత కనిపించి నన్ను పజిల్ చేసేవి. అక్బర్ని మర్చిపోలేదా యింకా? అనే సందేహం నాలో తలెత్తేది. కానీ అంత చిన్న వయసులో అలాంటివేం వుండవని నాకొక నమ్మిక. తన తత్వమే అంతనుకుని వదిలేసాను.



కథా నిలయం
5141
శ్రీకాకుళం

నా నమ్మకాన్ని వమ్ముచేస్తూ రాగిణి అక్బర్ కోసం బయల్దేరడం... ఏమిటిదంతా?

* * *

సెంట్రల్ జైలుకెళ్ళి సూపరింటెండెంట్‌ని కలిసి పర్మిషన్ తీసుకున్నాము. మమ్మల్ని థరోగా చెక్ చేసారు. సెంట్రీలు అక్బరున్న సెల్ దగ్గరకి తీసుకెళ్ళారు.

ఊచలకి వీపానించి నిల్చున్న వాడల్లా మా అలికిడికి మాకేసి తిరిగాడు. నేనొక్క అడుగు వెనక్కి వేసాను. రాగిణి బొమ్మలా అలాగే నిల్చుంది.

అక్బర్లో చాలా మార్పొచ్చింది. అప్పటి అమాయకమైన మొహమూ, సున్నితమైన రూపమూ లేవిప్పుడు. మొహం నిండా కత్తిగాట్లూ, దెబ్బల మచ్చలూ వున్నాయి. దృఢంగా, భయంకరంగా వున్నాడు. మమ్మల్ని చూసి తెల్లబోయాడు. తర్వాత చేతులు జోడించి నమస్కరించాడు.

మృత్యు ముఖంలో నిల్చున్న అతన్నిచూస్తుంటే యిప్పుడు నాకెలాంటి కోపమూలేదు. అతడిలా కావటానికి నాదీ కొంత పాత్ర వుందని లోపల్లోపలేనా అనుకోకపోతే నేను మనిషిని కాను.

"నువ్వెందుకొచ్చావిక్కడికి?" రాగిణిని సూటిగా అడిగాడు.

నేను కొంచెం దూరంగా వెళ్ళి నిలబడనా? ఇక్కడే వుండనా? అనే సందేహం కలిగి కొంత ఆలోచించుకున్న మీదట అక్కడే వుండాలనుకున్నాను.

"నన్ను క్షమించమని అడగటానికి" రాగిణి గొంతులో ధ్వనించిన భావమేదో నాలో ఒక విధమైన గిల్టీ కాన్షియెన్స్‌ని తట్టలేపింది.

"అదేంటి రాగిణీ? నువ్వేం చేసావు" అక్బర్ అయోమయంగా అడిగాడు.

"ఆడపిల్లగా పుట్టటమే నేను చేసిన తప్పు. నేను ఆడపిల్లని కాకపోయి వుంటే ఖాదర్ నాతో అలా అని వుండేవాడు కాదు. ఖాదర్‌లాగేనువ్వూ ఏదో ఒకరోజుని నా చెయ్యి పట్టుకుంటావని మా నాన్నభయపడేవాడు కాదు"

రాగిణీ! దిగ్భ్రాంతిగా అనుకున్నాను.

"మా నాన్న నిన్ను నమ్మలేకపోయాడు. ఎందుకంటే నువ్వు పైవాడివి. కానీ నన్ను కూడా నమ్మలేకపోయాడు. అది నాకు చాలా బాధనిపిస్తోంది. నువ్వీవేళ చావుకి దగ్గరయ్యావు. నేను? ఆ విషయం అర్థమైన రోజే మానసికంగా చచ్చిపోయాను."

నేను నా కూతుర్ని నమ్మలేకపోయానా? అందుకే అక్బర్ని వెళ్ళగొట్టానా? నన్ను నేను శోధించుకోవటం మొదలు పెట్టాను.

"నేనే కాదు. ఏ ఆడపిల్లేనా సరే, చెయ్యి పట్టుకోగానే ఆ మగవాడితో వెళ్ళిపోతుందా? అంత వ్యక్తిత్వం లేనివాళ్ళా ఆడపిల్లలు? మగవాడి స్పర్శ క్షణం సేపు రక్తంలో రేపే అలజడికి తట్టుకుని నిలబడలేనంత దుర్బలమైన వాళ్ళా? ప్రపంచంలోని తండ్రులందరి విషయం వదిలెయ్. నా తండ్రి, ఎంతో వుదాత్తుడనుకున్నాను. ఆయన కూడా అలాగే ఆలోచించడం.... నేను తట్టుకోలేక పోతున్నాను...."

నేను తలదించుకున్నాను.

"నిన్ను నేను యిప్పటికీ ప్రేమిస్తున్నాను అక్బర్! ఎలాగంటే ఒక కుటుంబంలోని వాళ్ళు ఒకళ్ళనొకళ్ళు ప్రేమించుకున్నట్టు. ఒక మనిషి సాటి మనిషిని ప్రేమించినట్టు నిన్ను నేను ప్రేమించాను. ఈ రోజు నీ పరిస్థితికి మేమంతా కారణం అన్న ఊహే నన్ను అడకత్తెర్లో వేసినట్టు నొక్కేస్తోంది."

"రాగిణీ! ఇప్పుడవన్నీ ఎందుకు? ఇలా జరగాలని వుంది. జరిగిపోయింది. మీ ఇంట్లో

వున్న ఆ కొద్ది రోజులూ నేను నిజమైన సంతోషాన్నీ, కల్మషం లేని ప్రేమనీ అనుభవించాను. మీ అందర్నీ జన్మజన్మకీ గుర్తుంచుకుంటాను" చాలాసేపటి తర్వాత అక్బర్ గొంతువిప్పాడు. అతన్ని మాటల్లోని నిజాయితీ ధ్వనిస్తోంది.

"ఆరోజుని... అంటే నిన్నింట్లోంచి వెళ్ళగొట్టిన రాత్రి నేను చిన్న పిల్లని. నా చేతుల్లో ఏమీ లేదు. ఈ రోజుని నాకు డబ్బుంది. వుద్యోగం వుంది. నీ కోసం ఎవర్నైనా ఎదిరించగల స్థైర్యం వుంది. చెప్పు అక్బర్ నీ కోసం నేనేం చెయ్యగలను?"

నేను దారుణంగా ఓడిపోయినవాడిలా నిల్చున్నాను. అవమానంగా గానీ, కోపంగా గానీ లేదు. చిత్రంగా రాగిణి యితడి కోసం ఏం చెయ్యగలదా అని ఆలోచిస్తున్నాను. "చెప్పు..." రాగిణి రెట్టించింది.

"క్షమాభిక్ష తిరస్కరించారు" నిదానంగా అన్నాడు అక్బర్. అతని మొహంమీద విచారపు నీడలు పరుచుకున్నాయి.

సెంట్రీ వచ్చి టైమైపోయిందని చెప్పాడు.

నిజమే! టైమైపోయింది. ఏం చెయ్యటానికీ కూడా. చేతుల్లో ముఖం కప్పుకుని ఏడుస్తున్న రాగిణిని బలవంతంగా అక్కణ్ణుంచి తీసుకుని వచ్చేసాను.